సాక్షి అనకాపల్లి

సోమవారం ౹ 19 ౹ జూన్ ౹ 2023



మండుటెండలోనూ భక్తుల రద్దీ

ఆదివారం అమావాస్య కావడంతో అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. IIలో



అంత్యక్రియలు

తీర్థయాత్రకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముద్దుర్తివాసులు నలుగురికీ అంత్యక్రియలు జరిగాయి. IIలో



శ్రావ్యంగా గాత్ర కచేరి

విశాఖ: కళాభారతిలో నిర్వహించిన కచేరీలో లంక తేజశ్విని, భమిడిపాటి వీణాధరి తమ గాత్రంతో అలరించారు.

న్యూస్‌రీల్

విద్యుత్ బిల్లులపై ఫేక్ లింక్స్ నమ్మొద్దు

ఈపీడీసీఎల్ అధికారుల విజ్ఞప్తి

సాక్షి, విశాఖపట్నం : బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేసేస్తామంటూ రాత్రి సమయంలో వస్తున్న ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్, మెసేజ్‌లను వినియోగదారులు విశ్వసించవద్దని ఏపీఈపీడీసీఎల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. బిల్లులు చెల్లించకపోతే ఫ్యూజ్‌లు వెంటనే తీసేస్తామంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ఈపీడీసీఎల్ సిబ్బంది, కాల్ సెంటర్ నుంచి బిల్లుల చెల్లింపుపై సాయంత్రం 5 నుంచి ఉదయం 8 గంటల మధ్యలో ఎలాంటి కాల్స్, మెసేజ్‌లు, లింక్స్ రావన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న ఈస్ట్రన్ పవర్ యాప్, భీమ్ యాప్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, నెఫ్ట్/ఆర్టీజీఎస్, టీఏ వాలెట్, బిల్ డెస్క్, పే యూ వెబ్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలని సూచించారు.

జాతీయ స్థాయి తైక్వాండోలో శ్వేతకు రజతం



శ్వేతను అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ సభ్యులు

యలమంచిలి : జాతీయ స్థాయి సీనియర్ తైక్వాండో పోటీల్లో యలమంచిలి పట్టణానికి చెందిన టి.శ్వేత రజత పతకం సాధించినట్లు జిల్లా తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి శ్వేత 53 కేజీల విభాగంలో పాల్గొని, రజత పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా యలమంచిలి తైక్వాండో క్లబ్ సభ్యులు, సీనియర్ తైక్వాండో క్రీడాకారులు, సహచర క్రీడాకారులు ఆమెను యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో ఘనంగా సత్కరించారు.


సరకు హ్యాండ్లింగ్‌లో పోర్టు సరికొత్త రికార్డు



పోర్టులో సరకు హ్యాండ్లింగ్ చేస్తున్న దృశ్యం

సాక్షి,విశాఖపట్నం: సరకు హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) సరికొత్త రికార్డు నెలకొల్పింది. పోర్టులో కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా అత్యధిక సరకు రవాణా చేసిన ఘనత సాధించింది. శనివారం నుంచి 24 గంటల కాల వ్యవధిలో 4,01,875 మెట్రిక్ టన్నుల సరకుని 23 షిప్పుల నుంచి వివిధ బెర్తుల ద్వారా హ్యాండ్లింగ్ చేసింది. ఒక్క రోజులో అత్యధిక హ్యాండ్లింగ్ చేసిన రికార్డుని తిరగరాసింది. ఈ ఏడాది మే 7వ తేదీన 27 షిప్‌ల నుంచి 3,78,760 మెట్రిక్ టన్నుల సరుకు హ్యాండ్లింగ్ ఇప్పటివరకు ఒక్క రోజులో చేసిందిగా రికార్డుల్లో ఉంది. దాన్ని అధిగమించడంపై పోర్టు చైర్మన్ డా.ఎం.అంగముత్తు ట్రాఫిక్ సిబ్బందిని ప్రశంసించారు. పోర్టు సిబ్బంది కలిసికట్టుగా పనిచేయటం ద్వారా మరిన్ని కొత్త రికార్డులను తిరగ రాయవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఘనతని సాధించడంలో కృషి చేసిన సిబ్బందికి డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్షా 50 వేల విరాళం



ఏఈవోకి విరాళం అందజేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఆర్. సుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.లక్ష, ఆర్. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు రూ.50 వేలు అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ఏఈవో వెంపలి రాంబాబుకు ఆదివారం అందజేశారు. వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించి, వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

కాయలు చెట్లకే!



ఈ ఫొటోలోని రైతు పేరు రెడ్డిపల్లి శంకర్రావు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం, శేరిఖండం గ్రామానికి చెందిన ఈయనకు ఏడెకరాల్లో మామిడితోటలున్నాయి. ఈ ఏడాది తన మామిడితోటల ఎరువులకు రూ.50 వేలు, మందులు, దుక్కులు, ఇతర ఖర్చులకు మరో రూ.50 వేలు వెరసి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కానీ రూ.30 వేల ఆదాయం కూడా రాలేదు. మార్కెట్లో ప్రస్తుతం క్రేట్ (25 కిలోలు) నాణ్యమైన మామిడికాయలు రూ.250-300కి మించి కొనుగోలు చేయడం లేదు. కోత కూలి, రవాణా చార్జీ సైతం గిట్టుబాటు కాక పక్వానికి వచ్చిన మామిడిని కూడా చెట్లకే వదిలేస్తున్నామని శంకర్రావు ఆవేదన చెందుతున్నాడు.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పిల్లి పెద్ద కాపుదీ అదే పరిస్థితి. ఈయన మూడెకరాల మామిడితోటను కొనుగోలు చేశాడు. గడచిన రెండేళ్లూ కాపు అంతంతమాత్రంగానే కాసింది. ఈ ఏడాదీ సగమే కాపు కాసింది. మొదట్లో ఒకింత మంచి ధరే పలికింది. కానీ అప్పటికి కాయలు పక్వానికి రాలేదు. ఇప్పుడు పక్వానికొచ్చాక కొనే వారే కరువయ్యారు. గాజువాక మార్కెట్‌కు ఆటోలు/వ్యానుల్లో తరలిస్తే రవాణా చార్జీలు, కూలి సొమ్ము రావడం లేదని, దీంతో కోయకుండా చెట్లకే కాయలు వదిలేశానని, ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లవచ్చని చెబుతున్నానని పెద్దకాపు చెబుతున్నాడు.



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పక్వానికి వచ్చినా కోయకుండా చెట్లకే వదిలేసిన దృశ్యం (ఇన్‌సెట్) చెట్లకు కాసిన కాయలు

- మామిడిని కోయకుండానే వదిలేస్తున్న రైతులు
- కోత కూలి, రవాణా చార్జీలు గిట్టుబాటు కాని పరిస్థితి
- ఈ ఏడాది ఎగుమతులు లేని ఫలితం
- టన్నుకు రూ. 10 వేలు కూడా దక్కని దైన్యం
- ధర లేక కుదేలైన మామిడి రైతు

సాక్షి, విశాఖపట్నం: ఇలా శంకర్రావు, పెద్దకాపులదే కాదు.. చాలా మంది మామిడి రైతులది ఇదే పరిస్థితి. కోవిడ్ నుంచి మామిడి రైతుకు కష్టకాలం దాపురించింది. కోవిడ్ మూడేళ్లూ అరకొర కాపుతో పాటు మామిడి ఎగుమతులు సరిగా జరగలేదు. ఈ ప్రాంతం నుంచి పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ఆ ప్రాంత వర్తకులు స్థానిక వ్యాపారులు, దళారుల ద్వారా కొనుగోలు చేసి లారీలు, వ్యాగన్లలో ఆయా రాష్ట్రాలకు తరలిస్తుంటారు. ఇలా సగం పంట ఎగుమతులకు పోను మిగిలినది స్థానిక మార్కెట్లలో విక్రయిస్తారు. ఈ ఏడాది కాపు ఆలస్యమైనా ఎగుమతులు బాగుంటాయని మామిడి రైతులు ఆశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,212 హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. వీటి ద్వారా లక్షా 38 వేల టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారుల అంచనా. కానీ ఈ సీజనులోనూ కాపు 50 శాతానికి మించలేదు. కాపు ఆలస్యంగా రావడంతో ఆరంభంలో టన్ను బంగినపల్లి, రసాలు వంటి రకాలకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ధర పలికింది. ప్రస్తుతం అది రూ.7–8 వేలకు పడిపోయింది. గతంలో 25 కిలోల క్రేట్ రూ.1,000–1,500 పలకగా ఇప్పుడది రూ.250–300కి దిగజారింది. ఈ ఏడాది కూడా ఎగుమతులు లేకపోవడంతో మార్కెట్లో రూ.100కి 3 కిలోలు విక్రయించగా, ఇప్పుడు ఐదారు కిలోలు లభిస్తున్నాయి. కొన్నాళ్లుగా మార్కెట్లో ఇవి ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి.

ఖర్చు తడిసి మోపెడు..

ఈ పరిస్థితుల్లో రైతులు తమ చెట్ల నుంచి మామిడికాయలను కోసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ కాయలు కోయడానికి చెట్లు ఎక్కే నైపుణ్యం ఉన్న కూలీలే ఉండాలి. వీరికి రోజుకు రూ.700 కూలి, మధ్యాహ్నం భోజనంతో పాటు సాయంత్రం మద్యం ఇస్తేనే పనికి వస్తున్నారని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో ధర లేకపోయినా కోత కూలీలకు వీటిని సమకూర్చాల్సిందే. కోసిన కాయలను మార్కెట్‌కు వ్యాన్లు, ఆటోల్లో తరలిస్తారు. ఇలా ఒక్కో క్రేట్‌కు కోతకు రూ.50, మందులు, ఎరువులకు రూ.50, రవాణా చార్జి రూ.100, ఆశీలు రూ.30 వెరసి రూ.230 వరకు ఖర్చవుతుంటే రూ.250 కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దీంతో శ్రమపడి కోసేకంటే చెట్లను వదిలి పెట్టడమే నయమన్న భావనతో పక్వానికి వచ్చినా కోయడం లేదు. మూడు, నాలుగేళ్ల నుంచి మామిడి అరకొర దిగుబడి, ఆశాజనకంగా లేని ధరతో కుదేలవుతున్నామని మామిడి రైతులు ఎంతో ఆవేదన చెందుతున్నారు.

అడ్వాన్స్‌డ్‌లోనూ అదే జోరు



లక్ష్మీ సూర్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు చిన అప్పలనాయుడు, ఉదయశ్రీ

- సత్తా చాటిన లక్ష్మీ సూర్య
- ఓపెన్ కేటగిరిలో 53.. ఓబీసీలో 6వ ర్యాంకు

మాడుగుల రూరల్ : జేఈఈ మెయిన్స్.. తెలంగాణ ఎంసెట్.. ఏపీ ఈఏపీ సెట్.. ఇలా పరీక్ష ఏదైనా ర్యాంకు మాత్రం కాళ్ల లక్ష్మీ సూర్యదే. అదే జోరు కొనసాగిస్తూ ఈ కేజే పురం విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 53వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 6వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఆదివారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. బాల్యం నుంచి చదువులో రాణిస్తున్న లక్ష్మీ సూర్య తరగతి పెరిగే కొద్దీ తన పరిధి పెంచుకుంటూ వచ్చాడు. జేఈఈ మెయిన్స్‌లో 14వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 17, ఇటీవల విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్‌లో 33వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ విద్యార్థి ఆరో తరగతి వరకు చోడవరం భాష్యం స్కూలులో చదివాడు. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు గుంటూరులో గల భాష్యం కళాశాలలో విద్యను అభ్యసించాడు. లక్ష్మీ సూర్య ఇంటర్‌మీడియట్‌లో 93.8 శాతం మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు కాళ్ల చిన అప్పలనాయుడు, ఉదయశ్రీలది వ్యవసాయ కుటుంబం. సా మిల్లు నడుపుతుంటారు. తనయుడి విజయ పరంపరతో వారి ఆనందానికి అవధులు లేవు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు రావడంతో కేక్ కట్ చేసి పండగ చేసుకున్నారు.

నిరంతర శ్రమే విజయానికి సోపానం

నిరంతర శ్రమ వల్ల ప్రతి పరీక్షలో తాను విజయం సాధించానని కాళ్ల లక్ష్మీ సూర్య పేర్కొన్నాడు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ రోజుకు 13 గంటలు చదివేవాడినని, తన విజయానికి తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కారణమని ఆయన పేర్కొన్నాడు ఐఐటీ ముంబాయి లేదా మద్రాస్‌లో చదివి, సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే తన జీవిత ధ్యేయమని లక్ష్మీ సూర్య పేర్కొన్నాడు.

అభినందనల వెల్లువ

ఐఐటీ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించిన లక్ష్మీ సూర్యకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు.. నిన్ను చూసి గర్వపడుతున్నామంటూ శుభాకాంక్షలు చెబుతున్నారు. ఉపాధ్యాయులు, చిన్ననాటి స్నేహితులు కంగ్రాట్స్ చెబుతూ ఆనందం పంచుకుంటున్నారు.

గిరి బాలుర సత్తా

మధురవాడ: మారికవలసలోని రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్–2023లో విశేష ప్రతిభ కనబరిచి.. ఎస్టీ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరు దేశంలోని ప్రఖ్యాత ఐఐటీల్లో సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి 18 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా.. అందరూ అర్హత సాధించారని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. విజేతలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ అభిషేక్ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



ఉపాధ్యాయుల చక్కని శిక్షణ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించాను. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలోని మారుమూల పింపలగూడ మా గ్రామం. తల్లిదండ్రులు అర్జున్, దమయంతి వ్యవసాయ కూలీలు. వారు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నేను మరింత బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా..

–జి.సంతోష్, 487వ

తల్లిదండ్రుల కష్టం వృథా కానివ్వను..



మాది అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని మారుమూల పల్లె ముళ్లమెట్ట. నాన్న సన్యాసిరావు రైతు, అమ్మ సుందరి గృహిణి. వాళ్లు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నాకు ఎస్టీ కేటగిరీలో 583వ ర్యాంకు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలనే లక్ష్యంతో చదువుతున్నాను.

– కె. సందీప్

రోబోటిక్స్ ఇంజనీర్ నా లక్ష్యం



రోబోటిక్స్ ఇంజినీర్ అవ్వాలన్నదే నా లక్ష్యం. అందుకు కష్టపడి చదువుతున్నాను. మాది అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలంలోని సీహెచ్ గంగవరం. నాన్న సోమరా, అమ్మ సోమరి వ్యవసాయ కూలీలు. వారు నన్ను బాగా చదివిస్తున్నారు. ఎస్టీ కేటగిరీలో 1625వ ర్యాంకు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది.

–పి.మోహన్

ప్రశాంతంగా ఎంఈవో-2 కౌన్సెలింగ్

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల్లో పోస్టింగ్
- నేడు విధుల్లో చేరనున్న ఎంఈవోలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రతీ మండలంలో రెండో ఎంఈవో పోస్టు భర్తీ కోసమని ఆదివారం విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ నేతృత్వంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 46 మండలాల్లో ఎంఈవో–2 పోస్టు భర్తీ కోసమని జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న గ్రేడ్–2 హెచ్ఎంలకు అవకాశం కల్పించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలో జెడ్పీ హైస్కూళ్లలో అర్హులైన 267 మందితో సీనియారిటీ జాబితాను ముందుగా ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించిన తరువాత ఫైనల్ జాబితా మేరకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 39 మంది గ్రేడ్ –2 హెచ్ఎంలు ఎంఈవో–2గా ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ముందుకొచ్చారు. నిబంధనల మేరకు వారికి కౌన్సెలింగ్ పద్ధతిన కోరుకున్న మండలాల్లో ఎంఈవో–2గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇంకా 7 మండలాల్లో ఎంఈవో–2 పోస్టులు ఉద్యోగోన్నతిపై భర్తీ చేయాల్సి ఉందని డీఈవో చంద్రకళ తెలిపారు. అందరికీ అవకాశం కల్పించటం జరిగిందని, అయితే 39 మంది మాత్రమే ముందుకొచ్చి విల్లింగ్ ఇవ్వటంతో వారికి ఉద్యోగోన్నతులు కల్పించామన్నారు. ఉద్యోగోన్నతులు పొందిన వారంతా సోమవారం నుంచి విధుల్లో ఉంటారు. డిప్యూటీ డైరెక్టర్ జీ.లక్ష్మణరావు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

వేసవి తాపం



మదీన గ్రామంలో బకెట్లో మంచినీటిని తాగి దాహం తీర్చుకుంటున్న కాకి

బుచ్చెయ్యపేట: ఎండ తీవ్రతతో ప్రాణాలు ఏవిధంగా దస్సి పోతున్నాయో ఈ ఫొటో చూస్తే తెలుస్తుంది. ఎండకు తోడు వడగాడ్పులు, ఉక్కపోత వేధిస్తుండడంతో మనుషులే కాక పశువులు, పక్షులు కూడా విలవిల్లాడుతున్నాయి. గ్రామాల్లో చెరువులు, బావులు, గెడ్డలు, వాగులు నీరు లేక ఎండిపోవడంతో మూగజీవాలు గుక్కెడు నీటి కోసం వెతుకులాట ప్రారంభించాయి. ఇళ్ల ముందు, బాత్ రూంలో ఉన్న బకెట్లు, కుండీల్లో ఉన్న నీటి కోసం కాకులు, ఇతర పక్షులు వచ్చి వాలుతున్నాయి. దొరికిన నీటితో దాహం తీర్చుకుంటున్నాయి.

'విక్రాంత్'కు బెర్త్ ఎక్కడ?

రక్షణ రంగంలో మన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటేలా భారత్ నిర్మించిన అత్యాధునిక విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్. ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిస్తూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ బాహుబలి యుద్ధనౌకను కొద్ది నెలల కిందట ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. త్వరలోనే విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో ఇది చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో.. అవుటర్ హార్బర్‌లో భారీ బెర్త్‌ను ఏర్పాటు చేసేందుకు నేవీ, పోర్టు సిద్ధమవుతున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం



ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌక



విక్రాంత్ స్వరూపం

- పొడవు: 262 మీటర్లు
- వెడల్పు: 62 మీటర్లు
- ఎత్తు: 59 మీటర్లు
- వేగం 28 నాటికల్ మైళ్లు
- సామర్థ్యం: 42,800 టన్నులు
- ఖర్చు: రూ.20 వేల కోట్లు

- త్వరలో తూర్పు నౌకాదళంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్
- అవుటర్ హార్బర్‌లో ఓ బెర్త్ విస్తరణకు ప్రణాళికలు
- పోర్ట్ అధికారులతో ఈఎన్‌సీ చీఫ్ చర్చలు

ఐఎన్ఎస్ విక్రాంత్.. విజయానికి, శౌర్యానికి గుర్తు. మన దేశ గౌరవానికి ప్రతీక. మన తొలి విమాన వాహక యుద్ధ నౌక. అప్పట్లో ఉన్న విక్రాంత్ కంటే మెరుగైన సాంకేతికతతో రూపొందించిన ఈ బాహుబలి యుద్ధ నౌక భారత్ చేతిలో బ్రహ్మాస్త్రంగా చెప్పుకోవచ్చు. విక్రాంత్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను వాడారు. క్యారియర్ మెషినరీ ఆపరేషన్లు, షిప్ నేవిగేషన్, ఆటోమేటిక్ సర్వైబిలిటీ సిస్టం ఏర్పాటు చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్‌కు అదనపు లిఫ్ట్ ఇచ్చే ఫ్లైట్ డెక్ స్కీ జంప్‌తో స్టోబార్ కాన్ఫిగరేషన్ ఏర్పాటు చేయడం వల్ల అతి తక్కువ సమయంలో టేకాఫ్ వీలవుతుంది. ఏ భాగం మొరాయించినా ఆ ప్రభావం మిగతా భాగాలపై పడదు. దీంతో ప్రయాణం నిరాటంకంగా సాగుతుంది.

కేరళలోని కొచ్చి షిప్‌యార్డ్‌లో రెండు వేల మంది షిప్‌యార్డ్ అధికారులు, సిబ్బంది, 13 వేల మంది కార్మికులు, ఉద్యోగులు విక్రాంత్ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. 42,800 టన్నుల సామర్థ్యంతో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌లతో క్షిపణి దాడిని తట్టుకునేలా నిర్మించారు. విక్రాంత్ నిర్మాణానికి దాదాపు రూ.20 వేల కోట్లు ఖర్చయింది.

త్వరలోనే తూర్పు నౌకాదళంలోకి..

రక్షణ పరంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన హిందూ మహా సముద్రంలో పైచేయి సాధించేందుకు ఐఎన్ఎస్ విక్రాంత్ కీలకంగా మారనుంది. విక్రాంత్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ రాకతో బంగాళాఖాతం, అరేబియా సముద్ర జలాలపై మన పట్టు మరింత బిగుస్తుంది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనే అత్యాధునిక వ్యవస్థ దీని సొంతం. అందుకే విక్రాంత్‌ను కీలకమైన తూర్పు నౌకాదళానికి కేటాయించాలని రక్షణ మంత్రిత్వ శాఖ ముందుగానే నిర్ణయించింది. రాత్రి సమయంలోనూ మిగ్ విమానాలు, ఇతర ఎయిర్‌క్రాఫ్ట్‌లు విక్రాంత్‌పై ల్యాండింగ్, టేకాఫ్‌లను ఇటీవలే విజయవంతంగా నిర్వహించాయి. మరోసారి కొచ్చి షిప్‌యార్డులో తుది ట్రయల్స్ నిర్వహించిన తర్వాత.. విశాఖకు విక్రాంత్ రానుంది. ఈ ఏడాది చివరిలోనైనా లేదా 2024 తొలి నాళ్లలోనైనా.. తూర్పు నౌకాదళం నుంచి రక్షణ బాధ్యతలు చేపట్టనుందని ఇటీవలే భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ స్పష్టం చేశారు.

బెర్త్ మ్యాపింగ్‌లో బిజీబిజీ

సాధారణ యుద్ధ విమానాల కంటే.. భారీగా ఉండే విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ప్రత్యేక బెర్త్ అవసరమవుతుంది. ఇప్పటివరకు తూర్పు నౌకాదళంలో 105 మీటర్ల పొడవు ఉన్న యుద్ధ నౌకలే అతి పెద్దవిగా ఉన్నాయి. వీటికి రెట్టింపు పొడవుతో విక్రాంత్ తయారైంది. 262 మీటర్ల పొడవు, 62 మీటర్ల వెడల్పు, 59 మీటర్ల ఎత్తుతో విక్రాంత్ నిర్మించారు. 14 అంతస్తులున్న ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లో మొత్తం 2,300 కంపార్ట్‌మెంట్లున్నాయి. గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంతో దూసుకుపోయే విక్రాంత్‌ను విశాఖలో ఎక్కడ బెర్తింగ్ చేయాలన్న దానిపై తూర్పు నౌకాదళాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. భారీ బెర్త్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ, తూర్పు నౌకాదళం పక్కపక్కనే ఉండటంతో ఎలాంటి భద్రతా లోపం లేకుండా.. విక్రాంత్ కోసం ప్రత్యేక బెర్త్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం పోర్టు చైర్మన్ డా.అంగముత్తుతో ఇటీవలే తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా సమావేశమై చర్చించారు. అవుటర్ హార్బర్‌లోని ఓ బెర్త్‌ను విస్తరించి.. ప్రత్యేకంగా విక్రాంత్‌కు కేటాయించాలని భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు, మ్యాపింగ్ సిద్ధం చేసే పనిలో నౌకాదళాధికారులు తలమునకలయ్యారు. మరో రెండు నెలల్లో దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమయ్యాక.. రక్షణ మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. అనుమతులు మంజూరైన వెంటనే.. పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



మోదకొండమ్మ పాదాల వద్ద కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి వేకువజాము నుంచే బారులు తీరారు. దూర ప్రాంతాల నుంచి వీరు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా కుంకుమ పూజలు చేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత ప్రసాదంతోపాటు తాగునీటి సౌకర్యం ఆలయ కమిటీ కల్పించింది.

అయ్యన్నకు సాధ్యం కానిది చేసి చూపించా!

- 22న ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులు
: ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



రోడ్డు విస్తరణకు ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీని చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: గొలుగొండ మండలం ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులకు రెండున్నరేళ్లు శ్రమించి అనుమతులు తీసుకువచ్చానని, ఈ నెల 22న వీటిని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రోడ్డు విస్తరణకు నోచుకోలేదన్నారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డును విస్తరించాలన్నది నర్సీపట్నం, పాడేరు నియోజకవర్గాల ప్రజల చిరకాల కోరిక అన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని 2020 డిసెంబర్ 2న సంకల్పిస్తే, ఈ నెల 17న అనుమతులు వచ్చాయన్నారు. సుమారు రెండున్నరేళ్లు శ్రమిస్తే రోడ్డు విస్తరణకు మోక్షం లభించిందన్నారు. రోడ్డు విస్తరణ ప్రాధాన్యాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆమోదం తెలిపారన్నారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు పంపిన వెంటనే అటవీశాఖ అనుమతులు లభించాయన్నారు. దశాబ్దాల నాటి రోడ్డు విస్తరణ కల నెరవేరుతున్నందున నియోజకవర్గ ప్రజల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రధానమైన రోడ్డు విస్తరణను గాలికి వదిలేశారని విమర్శించారు. గతంలో అటవీశాఖ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పని చేసి, ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ చేయలేని పనిని ఎమ్మెల్యేగా తాను రెండున్నరేళ్లలో సాధించానన్నారు. కొన్ని దశాబ్దాల నాటి సమస్యను చేతకాక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో పరిష్కారమవుతున్నందున చాలా సంతోషంగా ఉందన్నారు. రూ.6 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, సుర్ల బాబ్జి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మండుటెండలోనూ తగ్గని భక్తుల రద్దీ

- అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్: మండుటెండలోనూ నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీ తగ్గలేదు. పట్టణంలోని గవరపాలెంలో అమ్మవారి ఆలయానికి ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజుతోపాటు, అమావాస్య కావడంతో వేకువజాము నుంచే బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు వారి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

మానవత్వం చాటిన పోలీసులు

- తప్పిపోయిన వృద్ధురాలిని ఇంటికి చేర్చిన వైనం



లక్ష్మమ్మను బంధువుకు అప్పగిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ (ప్రకాశం జిల్లా): తన మనవళ్లు, మరికొందరితో కలిసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన వృద్ధురాలు తప్పిపోయింది. ఒంటరిగా బస్సు ఎక్కి సింగరాయకొండ చేరింది. స్థానిక పోలీసులు స్పందించి ఆమెను బంధువుల వద్దకు చేర్చారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సింగరాయకొండ ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం వలసంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు సద్దల లక్ష్మమ్మ తన మనవళ్లతో కలిసి మొత్తం 15 మంది ఈ నెల 13వ తేదీ తిరుపతి వెళ్లారు. బుధవారం తిరుపతి చేరుకున్న వీరంతా శనివారం స్వామివారి దర్శనం చేసుకుని లడ్డూ ప్రసాదం కోసం వెళ్లేటప్పుడు అక్కడ ఒక ప్రాంతంలో కూర్చోమని లక్ష్మమ్మను చెప్పారు. ఆ తర్వాత లక్ష్మమ్మ ఏదో పని మీద పక్కకు వచ్చి మళ్లీ తాను కూర్చున్న ప్రదేశానికి వెళ్లే క్రమంలో తప్పిపోయింది. చివరికి తన వద్ద ఉన్న డబ్బుతో బస్సు ఎక్కి తిరుపతి చేరింది. అనంతరం విజయవాడ వెళ్లే బస్సు ఎక్కగా బస్సు కండక్టర్ ఆమె వద్ద ఉన్న రూ.200కు సింగరాయకొండ వరకు టికెట్ ఇచ్చి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో దించాడు. అనంతరం ఎటు వెళ్లాలో తెలియక చివరికి మూలగుంటపాడు ప్రాంతానికి వెళ్లడంతో నరాల సుధాకర్ అనే వ్యక్తి ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి వివరాలు తెలుసుకున్నాడు. రాత్రికి తన ఇంటి వద్దే ఉంచుకుని ఆదివారం ఉదయం ఎస్సైకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా ఆమె పూర్తి వివరాలు తెలుసుకుని కొయ్యూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఫోన్ నంబర్ సేకరించి అతనికి ఫోన్ చేసి ఆ ఊరి పెద్దలకు సమాచారం అందించారు. లక్ష్మమ్మ చెప్పిన వివరాల ప్రకారం అక్కడి వారి ఇంటికి వెళ్లిన ఆ గ్రామ పెద్దలు.. తిరుపతిలోనే ఆమెను వెతుకుతూ ఉండిపోయిన మనవడు ఫోన్ నంబర్ సేకరించి ఎస్సైకు చెప్పారు. దీంతో ఎస్సై ఫాతిమా ఆ ఫోన్ నంబర్ ప్రకారం లక్ష్మమ్మ మనవడికి ఫోన్ చేశారు. ఆమె తన వద్ద ఉందని చెప్పడంతో మనవడు కొండలు వెంటనే గూడూరు సమీపంలో నివసిస్తున్న తన బంధువులకు సమాచారం అందించారు. శివసాయి దుర్గాప్రసాద్ అనే యువకుడిని లక్ష్మమ్మ వద్దకు పంపారు. తన వద్దకు వచ్చిన దుర్గాప్రసాద్‌కు లక్ష్మమ్మను ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా అప్పగించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మానవత్వం చూపి వృద్ధురాలిని బంధువుల వద్దకు చేర్చిన ఎస్సై ఫాతిమాను, ఏఎస్సై షేక్ మహబూబ్ బాషాను ప్రజలు అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శశి విద్యార్థుల హవా



రమహర్షిణి సాయినారాయణ అభిరామ్ గుణ్వంత్ రాజ్‌కుమార్ కృష్ణ



సాయిరామ్ ఆనంద్‌భాస్కర్ కావ్య

తగరపువలస: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఆలిండియా స్థాయిలో ఎస్.రామహర్షిణి 11వ ర్యాంకు, ఆర్.సాయి నారాయణ 118, కె.అభిరామ్ 152, వి.ఎస్.ఎస్.గుణ్వంత్ 235, వి.రాజ్‌కుమార్ 504, ఆర్.ఎన్.వి.కృష్ణ 751, పి.సాయిరామ్ 802, వి.ఆనంద్ భాస్కర్ 866, బి.కావ్య 991, ఎం.హెచ్.ఎన్.డి.సతీష్ 1135, డి.వి.వి.చైతన్య 1210వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ కేటగిరీలో వెయ్యి లోపు ఇద్దరు, 5 వేల లోపు నలుగురు, 10వేల లోపు 10 మందికి ర్యాంకులు లభించాయన్నారు. వివిధ కేటగిరీల్లో వెయ్యి లోపు 9 మంది, 5వేల లోపు 35 మంది, 10వేల లోపు 46 ర్యాంకులు వచ్చినట్లు వివరించారు. ర్యాంకర్లను వైస్ చైర్మన్ నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ క్రాంతి సుధ తదితరులు అభినందించారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భానుమూర్తి



పీలా తేజశ్రీ



జామి నరేంద్ర

పాయకరావుపేట: ఆదివారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారని శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్.భానుమూర్తి తెలిపారు. తమ విద్యార్థి ఎన్.సూర్యచరణ్ ఎస్సీ కేటగిరిలో 199వ ర్యాంకు, జనరల్ కేటగిరిలో ఎస్.అశోక్ 2366వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో అనకాపల్లిలోని నారాయణ వసతిగృహంలో విద్యనభ్యసించిన పీలా తేజశ్రీ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 248వ ర్యాంకు.. ఓబీసీ కేటగిరీలో 37వ ర్యాంకు సాధించింది. జామి నరేంద్ర ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 8,460వ ర్యాంకు.. ఓబీసీ కేటగిరీలో 1,885వ ర్యాంకు సాధించాడు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు

చోడవరం రూరల్ : తీర్థయాత్రకు వెళ్తూ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన మండలంలోని ముద్దుర్తి గ్రామవాసులు నలుగురికీ ఆదివారం ఉదయం గ్రామంలో ఆయా కుటుంబీకులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మందపల్లి శనీశ్వరస్వామి దర్శనార్థం వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున ఆలుమూరు మండలం మడికి గ్రామం వద్ద వారు ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముద్దుర్తి గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందగా మరో ఐదుగురు గాయాలతో ఆస్పత్రి పాలయిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో మృతిచెందిన బోడి వెంకటరమణ, బోడి వెంకునాయుడు, పి.కన్నయ్యలింగం, గంగిరెడ్ల శ్రీనుల మృతదేహాలకు గ్రామ సర్పంచ్ కె.వెంకట్, మాజీ సర్పంచ్ అప్పికొండ సోమేశ్వరరావు(లింగబాబు)లు రావులపాలెం సర్కిల్ పోలీసుల సహకారంతో శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించి, ఆదివారం ఉదయానికి మృతదేహాలను గ్రామానికి తరలించారు. మృతుల కుటుంబీకులు వారికి తుది వీడ్కోలు పలికి అంత్యక్రియలను పూర్తి చేసారు. మృతులకు గ్రామస్తులంతా నివాళులర్పించారు. ఇదిలా ఉండగా గాయపడిన వారిలో బోడి సత్యనారాయణను విశాఖలోని మెడికేర్ ఆస్పత్రికి తరలించగా, కోసూరి నర్సింగరావు రాజమండ్రిలోని సాయి నర్సింగ్‌హోమ్‌లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి వీర్రాజు థియేటర్ రోడ్డు లంబసింగి వనం రెస్టారెంట్‌కు ఎదురుగా గల శ్రీసాయి స్కేల్ సెంటర్ గట్టు పక్కన 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. మృతదేహన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. మృతుని శరీరంపై లేత నీలం రంగు షర్టు, బ్లాక్ షార్ట్, చేతులపై సత్యవతి అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నదని తెలిపారు. వివరాలు తెలిసిన వారు టౌన్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అసలు దొంగలు దొరికారు

- స్పందన స్ఫూర్తి ఫైనాన్సియల్ నిధుల గోల్‌మాల్
- స్నేహితునితో కలసి చోరీకి పాల్పడ్డ ఉద్యోగి



దొండపర్తి నాని



వంశీకృష్ణ

చోడవరం రూరల్: స్థానిక స్పందన స్ఫూర్తి ఫైనాన్సియల్ సంస్థ నిధులు రూ.6,57,270 దొంగిలించిన అసలు దొంగల్ని పట్టుకుని అరెస్టు చేసినట్టు కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. బాలాజీనగర్‌లో ఉన్న ఫైనాన్సియల్ సంస్థలో ఈ నెల 8న క్లస్టర్ మేనేజర్ సూర్యప్రకాష్ చేసిన తనిఖీలో సంస్థ నిధులు గోల్‌మాల్ జరిగిన సంగతి వెల్లడవడంతో ఈ నెల 13న చోడవరం పోలీసులకు సంస్థ సేఫ్‌బాక్సు తాళాలు ఉంచుకునే బ్రాంచి మేనేజర్, క్యాషియర్‌లపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ దర్యాప్తులో అసలు దొంగలు పట్టుబడ్డారని సీఐ చెప్పారు. సంస్థలో కలెక్షన్ సెక్షన్‌లో పనిచేసే అనంతగిరి మండలం తుమ్మలవలస గ్రామానికి చెందిన దొండపర్తి నాని బ్యాంకు చెస్ట్ తాళాలను తస్కరించి, ముందు రోజు 7న సెలవు పెట్టి, తన స్నేహితుడు దేవరాపల్లికి చెందిన ములకలాపల్లి వంశీకృష్ణ సహాయంతో బ్యాంకులో దొంగతనం చేసి సొమ్మును కాజేసినట్టు అంగీకరించారని సీఐ తెలిపారు. దీంతో చెస్ట్ తాళాలు తమ వద్ద ఉంచుకునే బ్రాంచి మేనేజర్ సంతోష్, క్యాషియర్ ఆంజనేయులు ఇద్దరికీ ఈ నేరంలో ప్రమేయం లేదని తేలిందన్నారు. అసలు నిందితులిద్దరినీ ఆదివారం అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించామన్నారు.

విద్యుత్ షాక్‌తో మూడు పశువుల మృతి



విద్యుత్ షాక్‌తో మరణించిన పశువులు

నాతవరం : సుందరకోట పంచాయతీ శివారు బమ్మిడికలొద్దు గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి మూడు పశువులు మృతి చెందాయి. ఎప్పటి మాదిరిగానే బమ్మిడికలొద్దు గ్రామానికి చెందిన కొండపల్లి లోవరాజు, తూబే సోమరాజుకు చెందిన ఆవు, ఎద్దు, పెయ్యి శనివారం మేతకు తీసుకెళ్లి కొండపోడు భూముల్లో వదిలేశారు. ప్రతి రోజు సాయంత్రం అయ్యేసరికి పశువులు ఇంటికి వచ్చేవి కానీ ఆ రోజు రాలేదు. మరుసటి రోజు ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలో పరిశీలించగా విద్యుత్ స్తంభం వద్ద వేలాడుతున్న వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌తో సంఘటన స్థలంలో మూడు పశువులు మృతి చెంది కన్పించాయి. పశువుల మృతితో లక్షా 10 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆర్థికంగా నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.60 వేల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 60 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపున ఉన్న న్యూ విద్యానగర్‌లో ఉంటున్న ఎం.బుచ్చిరాజు ఇంట్లో ఆదివారం ఉదయం పది గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదం సంభవించిన సమయంలో బుచ్చిరాజు కుటుంబీకులు ఇంట్లో లేరు. పొరుగు ఊరు వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ప్రమాదంలో ఫ్రిజ్ కంప్రెషర్ పేలిపోయింది, ఫ్రిజ్ లోపలి భాగం మంటల్లో కాలిపోయింది. ఎలక్ట్రికల్ ఇన్వెర్టర్ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిలోంచి పొగలు, కారు వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ వి.రామస్వామి, లీడింగ్ ఫైర్‌మేన్ యల్లపు నూకరాజు సిబ్బందితో ప్రమాదస్థలికి చేరుకుని, గునపంతో తలుపులను పెకలించి లోనికి ప్రవేశించారు. కమ్ముకున్న పొగలలో మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ముప్పు తప్పింది.

గ్రామీణ క్రీడాకారులకు ఉచిత శిక్షణ అభినందనీయం

- లక్ష్మీపురంలో క్రికెట్ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: గ్రామీణ యువత క్రీడల పట్ల మరింత ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. లక్ష్మీపురంలో ఉచిత క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారుడు శిరుచోళ్ల త్రినేత్ర తన స్వగ్రామంలో గ్రామీణ యువతకు క్రికెట్‌లో శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో అనేక మంది క్రీడాకారులు సరైన శిక్షణ లేక ఇక్కడే ఉండిపోతున్నారని, అలాంటి వారికి ఉత్తమ శిక్షణ ఇస్తే మంచి స్థానాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. యువత అన్ని క్రీడల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న యువతకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు, హైస్కూల్ కమిటీ చైర్మన్ భూతనాధుని రామారావు, రిటైర్డ్ పీఈటీ ఈశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్కల్ రథయాత్ర వేడుక రేపు

బీచ్ రోడ్డు: జగన్నాథ రథయాత్ర వేడుక మంగళవారం ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్టు సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర కుమార్ నాయక్ తెలిపారు. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. దసపల్లాహిల్స్‌లోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి శ్రీగుండిడా ఆలయం వరకు రథాన్ని భక్తులు లాగుతారన్నారు.

మోదీ పాలనలో దేశ భద్రత

- పొరుగు దేశాలు భారత్ అంటే భయపడుతున్నాయి
- రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్



మాట్లాడుతున్న ఎంపీ రమేష్, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్

సాక్షి, అనకాపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ దేశ భద్రతకు ప్రాధాన్యమిస్తారని, సరిహద్దుల్లో పొరుగు దేశాలు సైతం మన దేశం అంటే భయపడుతున్నాయని రాజ్యసభ సభ్యుడు సి.ఎం.రమేష్ అన్నారు. ఆదివారం అనకాపల్లి టౌన్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనపై నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 'కాశ్మీర్ ప్రత్యేక రాష్ట్రంగా ఉంటుంది.. ఈ రాష్ట్రం దేశంలో అంతర్భాగం కాదు..' అని చెప్పి పరిష్కరించకుండా వదిలేసిన సమస్యను కూడా చాకచక్యంగా పరిష్కరించారన్నారు. కాశ్మీర్‌లాంటి రాష్ట్రాన్ని దేశంలో అంతర్భాగంగా చేసి తానేంటో నిరూపించుకున్నారన్నారు. ఈ తొమ్మిదేళ్లలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఏపీలో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందని.. మోదీ అందించే పథకాలకూ తన ఫొటో వేసుకుని సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణాలు తప్ప ఏపీలో మరే అభివృద్ధి జరగలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా 66 కోట్ల మందికి జనధన్ బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేశామని, దేశంలోనే మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. బీజేపీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మాలకొండయ్య, పార్టీ నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఈర్లె శ్రీరామ్మూర్తి, గండి వెంకట సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బర్రిమామిడి వద్ద వ్యాను బోల్తా

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

గంగవరం: గంగవరం మండలం బర్రిమామిడి సమీపంలో మామిడి పుల్లల లోడుతో గంగవరం వైపు వస్తున్న వ్యాను బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం శనివారం రాత్రి పది గంటల సమయంలో జరగ్గా ఆదివారం ఉదయం వరకు బయటకు రాలేదు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చినబాబు, తహసీల్దార్ శ్రీమన్నారాయణ ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్ఐ చినబాబు ఆదివారం విలేకరులకు తెలిపిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి- కామరాజుపేటకు చెందిన 11 మంది ఏపి39డబ్ల్యూ 0402 వ్యానులో వై.రామవరం మండలం తనికిలపాడు గ్రామం నుండి మామిడి పుల్లలను వ్యానులో లోడు చేసుకొని గంగవరం వైపు వస్తుండగా బర్రిమామిడి- జడేరు మార్గమధ్యంలో మలుపులో వ్యాను అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వ్యాన్‌పై కూర్చున్న కూలీలు కిందపడిపోగా వారిపై పుల్ల పడిపోవడంతో గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన వీరమల్ల సుందర్‌సింగ్ అలియాస్ చిన్నా (29) అనే వ్యక్తి అక్కడక్కడే మృతి చెందాడు. పలువురు గాయాలపాలవ్వగా, వారిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ గంగవరం మండలం నెల్లిపూడికి చెందిన జట్లా శ్రీను, బొట్టా శివనాగు, కె.శ్రీను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతి చెందిన సుందర్‌సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. వ్యానులో మొత్తం 11 మంది పయాణిస్తుండగా ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలైనట్లు వివరించారు.

క్లుప్తంగా

శంకరంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని జాతీయ రహదారి శంకరం గ్రామంలో సోమవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా నూకాంబిక పూజలు



కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వారపు పొద్దు, అమావాస్య కలిసి రావడంతో భక్తులు ఎక్కువగా తరలివచ్చారు. చీరలు, రవికెలు, అరటి గెలలు, తల నీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు వేగి శివగణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో జాతర, గంప జాతరలు చేసి, అన్న సమారాధన నిర్వహించారు.

పాలు, పెరుగుతో దంత సమస్యలు దూరం



సదస్సులో మాట్లాడుతున్న డెంటిస్ట్ గణేష్

అనకాపల్లిటౌన్ : పాలు, పెరుగు తీసుకోవడం ద్వారా దంతాలకు కాల్షియం ఎక్కువగా లభించి, దంత సమస్యల్ని దూరం చేసుకోవచ్చని ప్రముఖ డెంటిస్ట్ సీహెచ్ గణేష్ తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో దంత సమస్యలు-నివారణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు చాక్లెట్లు, పిజ్జా, నూడుల్స్ ఎక్కువగా తినడం దంత సమస్యలకు కారణమన్నారు. రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవడం ద్వారా దంత సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. తీపి పదార్థాలు తిన్నాక మంచినీళ్లతో పళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సాఫ్ట్ టూత్‌బ్రష్‌లు దంతాలను సంరక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నల్లల దేముళ్లు, కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా కోటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి మండల విద్యాశాఖాధికారి(ఎంఈవో)-2గా కె.కోటేశ్వరరావును నియమిస్తూ విద్యాశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంఈవో డి.దివాకర్ గోపాలపట్నంకు బదిలీపై వెళ్లారు. కోటేశ్వరరావు అనకాపల్లి మండలం దిబ్బపాలెం హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ, పదోన్నతిపై ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 15 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్ 1 యూనిట్, ఏబీ పాజిటివ్ 2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 243 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

బాల సదనం.. వసతుల నిలయం



కశింకోట బాల సదనం



నిర్మాణ పనుల్లో కార్మికులు

- చురుగ్గా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవ

కశింకోట : మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన 'బాల సదనం' అందంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల ఆదేశాల మేరకు నెలన్నర క్రితం అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బాలలకు కావలసిన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

మూడున్నర దశాబ్దాల చరిత్ర

మండల పరిషత్ ప్రాంగణంలో మూడున్నర దశాబ్దాల క్రితం బాల సదనం ఏర్పాటయింది. మొదట్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలలు వసతితోపాటు, చదువుకునేలా అవకాశం కల్పించారు. జిల్లాలోని అనాథలు, సింగిల్ పేరెంట్(తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు మాత్రమే ఉన్న) పిల్లలు, నిరుపేద కుటుంబాల పిల్లలను ఇక్కడ చేర్చుకునేవారు. 60 మంది బాలలు చదువుకోవడానికి అవసరమైన సీట్లు కేటాయించారు. భోజనం, వసతి ఇందులోనే. చదువు కోసం సమీపంలోని పాఠశాలలకు వెళ్లేవారు. అయితే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు వచ్చాక బాల సదనం ప్రవేశాలను 1 నుంచి 5వ తరగతికి వరకు పరిమితం చేశారు. 6వ తరగతి ఇంటర్ వరకు ఉన్న బాలల్ని కేజీబీవీలో చేర్పించారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలల్ని చేర్పిస్తున్నారు. అయితే వసతులే ఇక్కడ ప్రధాన సమస్య.



సంరక్షకులు, తల్లిదండ్రులు సేద తీరేందుకు చెట్ల కింద నిర్మించిన సిమెంట్ చప్టా

కొరవడిన వసతులు

బాల సదనానికి ఐదేళ్ల క్రితం నూతన భవనం నిర్మాణం చేపట్టి, బాలలకు అవసరమైన గదులను నిర్మించారు. ఇతర మౌలిక సదుపాయలను కల్పించకుండా కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పిల్లలు ఆడుకోవడానికి సరైన మైదానం లేదు. వారికి కేటాయించిన డార్మెటరీలు, రీడింగ్ రూంలు, ఇతర గదులకు వెళ్లేందుకు సరైన మార్గం కూడా ఏర్పాటు చేయలేదు. ప్రహరీని ఎత్తు తక్కువగా నిర్మించడంతో సరైన రక్షణ లేకుండా పోయింది. ఒకచోట ప్రహరీ దెబ్బతిన్నా దాన్ని పునర్నిర్మించలేదు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ దృష్టికి బాల సదనం సమస్యల్ని స్థానిక అధికారులు తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రెండు మాసాల క్రితం జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సదనాన్ని సందర్శించి సదుపాయాల కల్పనకు అధికారులను ఆదేశించారు. పిల్లలు తమ దుస్తులు ఉతుక్కునేందుకు వాషింగ్ మెషిన్ సమకూర్చారు.

కలెక్టర్ ఆదేశాలతో పనులు

కలెక్టర్ ఆదేశాలతో నెలన్నర క్రితం బాల సదనంలో పనులు చేపట్టారు. ప్రహరీని ఎత్తు చేస్తున్నారు. పిల్లల్ని చూసేందుకు వచ్చే పేరెంట్స్, సంరక్షకులు నిరీక్షణకు వీలుగా ప్రాంగణంలో మర్రి చెట్టు, మామిడి చెట్ల కింద సిమెంట్ దిమ్మలను నిర్మించారు. చుట్టూ పూల మొక్కలతో ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే లైనింగ్ గోడలు నిర్మించారు. గదులు, డార్మెటరీలు, రీడింగ్ రూం తదితర గదులకు వెళ్లేందుకు మార్గాల ఏర్పాటు, రాళ్లురప్పలతో నిండిన ఆట స్థలం చదును చర్యలు చేపడుతున్నారు. శనివారం స్థానిక సమగ్ర బాలికల వసతి గృహ రీమోడలింగ్ పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్, బాల సదనంలో పనులపై ఆరా తీశారు.

చురుగ్గా పనులు

బాల సదనంలో సదుపాయాలు మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలు బాల సదనం వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందుకే నిధులు మంజూరై, పనులు జరుగుతున్నాయి.

– శశికళ, బాల సదనం ఇన్‌చార్జి

రైతుల పోరాటాన్ని పట్టించుకోని కేంద్రం

- రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ



రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీల ర్యాలీ

తుమ్మపాల : రైతాంగం ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, సమస్యల్ని పరిష్కరిస్తామంటూ రాజకీయ పార్టీలు చెప్పే మాటలు బూటకమని రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ ఆరోపించారు. పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రైతులు, వ్యవసాయ కూలీల మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతాంగం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనంగా గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యల తీవ్రత స్పష్టం చేస్తుందన్నారు. మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా మద్దతు ధరల చట్టం అమలు కోసం ఢిల్లీ వీధుల్లో రైతులు తీవ్రంగా పోరాటం చేసినా కేంద్రప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ రైతుల దుర్భర పరిస్థితులకు పాలకుల వినాశకర విధానాలే కారణమన్నారు. అంతకుముందు రైతులు, కూలీలతో కలిసి రైల్వే అండర్ బ్రిడ్జ్ నుంచి నెహ్రూ చౌక్ సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆడారి అప్పారావు, కార్యదర్శిగా కోన మోహనరావు, 20 మంది సభ్యులను నియమించారు. కార్యక్రమంలో కార్మిక నగారా పక్షపత్రిక ఎడిటర్ ఆడారి అప్పారావు, జనసాహితి జిల్లా అధ్యక్షుడు బిటీఆర్వీ శివాజీరావు, నవయువ సమాఖ్య జిల్లా నాయకులు ఎన్.భాస్కరరావు పాల్గొన్నారు.

దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



దేవాంగ విద్యార్థులకు ప్రతిభ అవార్డుల పంపిణీ

తుమ్మపాల : దేవాంగ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని దేవాంగ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం సూచించారు. చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో గొల్లవీధి కల్యాణమండపంలో ఆదివారం దేవాంగ కుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దేవాంగ విద్యార్థులు 23 మందిని జ్ఞాపిక, ప్రశంసా పత్రం, నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ గత పదేళ్లుగా విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా ఈ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ముప్పన సిల్క్స్ అధినేత సుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో ఈ బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉజ్జి సత్యనారాయణ, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



పైడివాడ అగ్రహారంలో రైతులకు ఈకేవైసీ చేయిస్తున్న ఏవో సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: పీఎం కిసాన్ లబ్ధిదారులంతా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఆదివారం పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఈకేవైసీ చేయడంతో పాటు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 10 వేల మంది వరకూ పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా ఇప్పటికే 8,500 మందికి ఈకేవైసీ పూర్తిచేశామన్నారు. మిగిలిన రైతులంతా ఈకేవైసీ చేయించుకునే విధంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు. రైతులంతా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ముఖ ఆధారితం ద్వారా గానీ, లేని పక్షంలో లబ్ధిదారుల ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయడం ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వద్దాది అప్పలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భువనేశ్వరీదేవి అధివాసం



ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చెల్లయ్యమ్మతోటలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో చుట్టు పక్కల గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు. దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి మండలానికి ఒక సారి నిర్వహించే అధివాసంలో ఒక్కో అధివాసం రోజు ఒక్కో పత్రితో పూజలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆదివారం ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ పత్రులతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరిపారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ దర్శించుకున్నారు. భువనేశ్వరీదేవి సంస్థాన్ ట్రస్టు నిర్వాహకులు సురేష్ రాజ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరించారు.

ఆషాఢం వచ్చినా.. అధిక ఉష్ణోగ్రతలే..

కశింకోట : ఆషాఢం వచ్చినా ఇంకా అధిక ఉష్ణోగ్రతలు, వడ గాల్పులు కొనసాగుతుండటంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే తొలకరి మొదలై, వాతావరణం చల్లబడాల్సి ఉండగా ఆ జాడేలేదని వాపోతున్నారు. మండలంలో ఆదివారం కూడా అధిక ఉష్ణోగ్రతతోపాటు వడగాడ్పులు వీచాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇళ్లల్లో ఉన్నా వేడిగాలుల సెగ తప్పలేదు. అత్యవసర పనులున్నవారు మినహా, ఎవరూ బయటికి వెళ్లేందుకు సాహసించలేదు. దీంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఇక్కడి జాతీయ రహదారి, ప్రధాన రోడ్లు జన సంచారం, వాహనాల రాకపోకలు లేక వెలవెలబోయాయి.

పడమటమ్మకు ప్రత్యేక పూజలు



కశింకోట : మండలంలోని విసన్నపేట వద్ద వెలసిన పడమటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గురువు పెనిమిటి సాంబమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మ వారిని అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

కోడిపందాలాడుతున్న ఇద్దరి అరెస్ట్

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు శివారులో కోడిపందాలాడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నరసింగరావు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అజ్ఞాత వ్యక్తులిచ్చిన సమాచారం మేరకు కోడిపందాల స్థావరంపై దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి మూడు కోళ్లు, రూ.2,100 నగదు స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక శక్తులపై స్థానిక ప్రజలు సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించి, సహకరించాల్సిందిగా కోరారు.

సాగర తీరంలో.. సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో తీరంలో సేదదీరడానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆదివారం ఉదయాన్నే తీర ప్రాంతాలకు చేరిన పర్యాటకులు మధ్యాహ్నం వరకు ఇసుక తెన్నెలపై కాలక్షేపం చేశారు. భోజనం చేసిన తర్వాత తీరంలో ఆట పాటలతో ఎంజాయ్ చేశారు. సముద్ర జలాల్లో జలకాలాటలతో సందడి చేశారు.

ఎవరికి ఏ కష్టమొచ్చినా..

అండగా నేనుంటా



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- నాలుగేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ప్రజాప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : ఈ సంక్షేమ పాలనను ఇలాగే కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని, పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రజలను కోరారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ సుబ్రహ్మణ్యకాలనీలో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికీ తిరిగారు. గత నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం ఏయే పథకాల కింద ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో.. ప్రతి ఇంటికీ వెళ్లి, గణాంకాలతో సహా వివరించారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా.. అండగా తానుంటానన్న భరోసా నిచ్చారు.

తమ కాలనీలో తాగునీటి సరఫరాకు పైపులైన్ ఏర్పాటు చేయాలని పలువురు కాలనీ వాసులు మంత్రిని కోరారు. పింఛన్ కోసం వృద్ధ దంపతులు, ట్రైసైకిల్ కోసం కుష్టు వ్యాధిగ్రస్తుడు మంత్రికి మొర పెట్టుకున్నారు. తక్షణమే వారికి సాయం చేయాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా సంక్షేమ పథకాల కోసం ఎవరూ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి లేదని, మీ ఇంటి ముంగిటకే వచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం పేదలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమాన్ని అందించిన తీరును ప్రజలకు తెలిపారు. విద్యే భవిష్యత్తు తరానికి తరగని ఆస్తిగా భావించిన సీఎం జగనన్న విద్యాభివృద్ధికి చేపట్టిన నాడు-నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర కార్యక్రమాలను వివరించారు. గత, ప్రస్తుత పాలనకు తేడా గమనించి సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. మహిళలు పూలు చల్లి మంత్రికి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, పలకా సత్యనారాయణ, ఎంపీటీసీ-1 జోగా నాగమణి, జోగా నాగేశ్వరరావు, ఎంపీటీసీ-2 కర్రిమజ్జి అలివేణి, మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఉపాధ్యక్షుడు రావి కిషోర్, ఉప సర్పంచ్ పోటుకూరి భవానీ, స్థానిక నాయకులు అప్పలరాజు, పుడమి వెంకటస్వామి, జగన్నాథం అబ్రహం, షేక్ ఖాన్, గంట్యాడ ప్రసాద్, షేక్ అలీషా, చెవ్వేటి శ్రీను, ఉప్మాక శ్రీను, గంట్యాడ సత్తిబాబు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, డీఆర్‌డీఏ ఏపీఎం నీలాచలం, పంచాయతీ కార్యదర్శి కె.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సతకంపట్టు దుర్గామల్లేశ్వరుల కల్యాణం



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దుర్గా మల్లేశ్వర స్వామివారి కల్యాణం సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం స్వామివారి కల్యాణమహోత్సవంలో భాగంగా వ్యాపారవేత్తలు నాయుడు, యుగంధర్, పూర్ణ, అబ్బులు దంపతులు లక్ష్మీగణపతి హోమం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ 6వ వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులుగా స్వామివారికి వివిధ రకాలైన ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి కల్యాణం నేడు

- రేపటి నుంచి జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19న ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 10.15కు జగన్నాథస్వామి ఆలయం నుంచి గవరపాలెం పెరుగుబజార్, గాంధీబొమ్మ జంక్షన్, మళ్లవీధి, గూడ్స్‌రోడ్డు వరకు రథోత్సవం కొనసాగుతుందన్నారు. గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామికి ఈ నెల 29 వరకు ప్రతి రోజూ దశావతరాల రూపంలో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. చివరి రోజైన 29న భారీ అన్నసమారాధన అనంతరం, తిరుగు రథ యాత్ర నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

తల్లిదండ్రుల త్యాగాలు మరువలేనివి

- ప్రపంచ పితృ దినోత్సవ కార్యక్రమంలో ఎంపీ సత్యవతి దంపతులు



కుటుంబ పెద్దల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ దంపతులు

అనకాపల్లిటౌన్ : తల్లి బిడ్డకు జన్మనిస్తే, ఆ బిడ్డల ఆలనా పాలనా చూసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఆశతో తండ్రి ఆరాటపడతాడని ఎంపీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆవరణలో ఆదివారం ప్రపంచ పితృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన తండ్రి దివంగత భీశెట్టి జగన్నాథరావు, అత్తమామలు కాండ్రేగుల రామజోగినాయుడు, మాణిక్యమ్మ దంపతుల చిత్రపటాలకు ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులిద్దరూ సమానమేనని, వారి త్యాగాలను పిల్లలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. తండ్రి ఎప్పుడూ నా బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశపడుతూ, అందుకు తన జీవితాన్ని ధారపోస్తారని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఆంధ్రపద్య కవితా సదస్సు అధ్యక్షుడు కోటారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.